గోరంత దీపాలు

వేపచెట్టు!

తల్లిప్రేమలాంటి చల్లని నీడనిచ్చే వేపచెట్టు!!—

దరిద్రుడి గుండెల్లో నుండి పుట్టిన అంతులేని ఆశల్లా ఆ చెట్టు బోదె నుండి పుట్టిన కొమ్మలు నాలుగు దిక్కులా వ్యాపించగలిగినంతమేర వ్యాపిస్తున్నాయి. కలిగిన వాడికి బాగా కండపట్టినట్లు ఆ కొమ్మలు ఆకు పూత పిందెతో నిండుగా ఉన్నాయి.

ఆ చెట్టు ఒకానొక కొమ్మకు వ్రేలాడదీసిన నాలుగు యినుప గొలుసులు.... ఆ యినుప గొలుసులకు తగిలించిన ఓ పెద్ద పీట.... అది ఉయ్యాల పీట!

ఆ పీటమీద అతడు కూర్చున్నాడు!—

గతాన్ని నెమరువేస్తూ వర్తమానాన్ని తలపోస్తూ భవిష్యత్తును సందర్శిస్తున్నట్లున్న అతడు ఓ మహాయోగిలా దర్శనమిస్తున్నాడు.

అతని ముందు ఓ కుర్రవాడు నిలబడి ఉన్నాడు.

ఆ కుర్రవాడు నిలబడి ఉండడంలో వినయం ఉట్టిపడుతూ ఉంది. వేషంలో సంస్కారం గోచరిస్తూ ఉంది. అతని ముఖం ఆనందంతో వెలిగి పోతూ ఉంది.

అతని వయస్సు పాతిక సంవత్సరాలకు పైబడి ఉంటుంది.

ఆ కుర్రవాడు క్రౌంకంకులా వంగి అతని పాదాలకు నమస్కరిస్తున్నాడు.

ఆయన నిమీలిత నేత్రుడై చేయెత్తి ఆశీర్వదిస్తున్నాడు. ఇద్దరి కను కొలకుల్లో నిలిచిన నీళ్ళు, సంజవెలుగులో ముత్యాల్లా మెరుస్తున్నాయి. అనిర్వచనీయమైన కృతజ్ఞతా భావం ఆ యిద్దరి మొగాల్లో దోబూచులాడుతూ ఉంది. అనుభూతితో వాళ్ళు మూగబోయారు.

ఆ మధుర సన్నివేశాన్ని మైలపరచడం యిష్టంలేదు. అలాగని ఆ నాలుగు బారల దూరంలో అలానే నిలబడి పోవడానికి మనస్కరించలేదు. ఈ తటస్థ స్థితిలో అడుగు ముందుకు పడలేదు.

తనివిదీరనట్లు మళ్ళీ ఒకసారి ఆ కుర్రవాడు అతని పాదాల్ని ఒడిసి పట్టుకొన్నాడు. పాదాల మీద తలను ఆనించాడు. కన్నీటితోనే అతని పాదాల్ని కడుగుతున్నాడేమో మరి?—

ఆయన ఎటో చూస్తున్నాడు. ఆశీర్వదించడానికి ఎత్తినచేయి ఎత్తినట్లుగానే ఉంది. చేరడేసి చెంపలమీద నుండి జాలువారుతున్న కన్నీళ్ళు ఆ కుర్రవాని తలమీద పడుతున్నాయి ముత్యాల్లా!

కన్నీటి ముత్యాలతో ఆశీర్వాదం అందుకొంటున్న ఆ కుర్రవాడు ఎంతటి ధన్యుడో?—

ఎవరీ కుర్రవాడు? ...ఏమిటి వీళ్ళిద్దరిమధ్య సంబంధం? ....మహా మేరువులాంటి ఆ మనిషిని కదిలించిన ఆ కుర్రవాడెంతటి అదృష్టవంతుడు?- అని ఆలోచిస్తూ నిలబడ్డాను.

దాదాపు రెండు మూడు చదరపు మైళ్ళ విస్తీర్ణం కలిగిన ఆ ఆవ రణలో ఈ వేపచెట్టు కంటే పెద్దవయిన రాగిచెట్లున్నాయి. మఱ్ఱి మాను

లున్నాయి. జువ్విచెట్లున్నాయి. రకరకాల పూల పాదులున్నాయి. కూరల తోటలున్నాయి. బంగారు కరిగించి పోసినట్లున్న ఆ సంజ వెలుగుతో తడిసి ముద్దవుతున్నాయి అక్కడి చెట్లు చేమలు! వాళ్ళిద్దరు అనుభూతితో తడిసి ముద్దవుతున్నారు. ఈ అనుభూతిని ఆకళింపు చేసుకొన్న చెట్లమీది పాల పిట్టలు పరవశంతో పాడుతున్నాయి.

కొన్ని నిముషాలు మాత్రమే కొనసాగిందీ పరిస్థితి!

ఆ కుర్రవాడు పైకి లేచాడు. కన్నీటి మయమయిన కన్దోయిని జేబురుమాలుతో వత్తుకొన్నాడు. మళ్ళీ ఒకసారి రెండు చేతులు జోడించాడు. జోడించిన చేతులు జోడించినట్లే ఉంచుకొని అలానే నాలుగడుగులు వెనక్కు వేశాడు. అక్కడ నిలబడి మళ్ళీ ఒకసారి శిరస్సు వంచి నమస్కరించాడు. గిరుక్కున వెనక్కు తిరిగి హుందాగా ముందుకు సాగి పోతున్నాడు.

ఆ ఉయ్యాల పీటమీద ఆ మహా మనీషి, కూర్చున్న మనిషి కూర్చున్నట్లుగానే ఉండిపోయాడు—వెళ్ళిపోతున్న ఆ కుర్రవానివైపు తదేక దృష్టిని నిల్పి.

ఆ ఆవరణలో బాలబాలికలకు వసతి గృహాలున్నాయి. అతిధులకు ప్రత్యేక సదుపాయాలతో గదులున్నాయి. వయోవృద్ధులకు వసతులున్నాయి. చదువుకోవడానికి గ్రంథాలయ ముంది. సాయంసమయములో పూజకు ప్రార్థనాలయముంది.

అది విద్యానగరం!

ఆ నగరంలో అతడు మకుటంలేని మహారాజు! ప్రతిరోజు అదే సమయానికి ఆయన అక్కడికి వస్తారు. ఆ పీటమీద కూర్చుంటారు. ఆయన అక్కడ ఉన్నంతసేపు అసలే ప్రశాంతతకు మారుపేరయిన ఆ ప్రదేశం మరింత ప్రశాంతంగా ఉంటుంది. ఎవరి పనుల్లో వాళ్ళుంటారు. ముఖ్యంగా బాలబాలికలు, చదువుకొంటూనో వ్రాసుకొంటునో తమతమ పనుల్లో తాము లీనమయి ఉంటారు. తమ పనుల్ని తాము నిర్వర్తించు

కొంటున్న మనుష్యుల్ని....శ్రద్ధగా చదువుకొంటున్న పిల్లల్ని చూస్తూ....ఆ గోరంత దీపాల్లో కొండంత వెలుగుల్ని ఆశిస్తూ....ఆయన ఆనందానుభూతిలో తేలిపోతుంటారు!

రాత్రి ఏడుగంటల ప్రాంతంలో గంట కొడతారు. గంట శబ్దం చెవిని పడడంతో పిల్లలందరు బిలబిలా వచ్చి గుమిగూడుతారు. ఒక్కొక్కడి చేతిలో ఓ కంచము, మంచినీటికి లోటా ఉంటుంది. అందరు అక్కడ చేరే సరికి ఆయన ఉయ్యాలపీటమీద నుండి లేచి నిలబడతారు. ఆయన నిలబడే సరికి పిల్లలందరు వరుసదీరుతారు. అందరు కలిసి గొంతెత్తి పాడుకొంటూ ఆ వరుస ముందుకు కదులుతుంది. ఒక్కొక్కరుగా ముందుకు నడుస్తూంటే ఓ చోట కంచములో అన్నం వేస్తారు. మరోచోట పులుసు పోస్తారు. ఇంకొకచోట మజ్జిగ అన్నం వడ్డిస్తారు. చెవుల కింపుగా పాడుకొంటూ ఆ పిల్లలందరు అన్నం వడ్డించుకొనే దృశ్యం—కనుల పండువుగా వుంటుంది.

తెగిన గాలిపటాల్ని తాడువిడిచిన బొంగరాల్ని ఓ చోట చేర్చి—గోరంత దీపాలకు కొండంత వెలుగు చేకూర్చాలని కృషిచేస్తున్న ఆ మహా మనీషిని చూస్తే చేతులెత్తి నమస్కరించవలె ననిపిస్తుంది. అందుకే అను దినము కాకపోయినా ఆయనతో కాలక్షేపం చేయడానికి అలవాటుపడ్డాను.

ఆయన మాట్లాడుతాడు. అవి మాటలుగావు జీవితానుభవం నుండి వెలువడిన అక్షరసత్యాలు.

ఆయన అప్పుడప్పుడు గతస్మృతులతో నవ్వుతాడు. అది నవ్వు గాదు. జీవితానుభవమనే వడదెబ్బకు నలిగిన పువ్వు!—అయినా వాడి పోలేదు.

ఆయన కష్టాల్ని భరించాడు. కాకుల అరుపుల్ని విని లోకమే కాకు లనుకొన్నాడు. ఆయన ఓర్పు వహించాడు. తన ధ్యేయాన్ని అందుకోవ డములో నేర్పు చూపించాడు. తత్ఫలితంగా ఎప్పుడో అటు బారెడు యిటు బారెడు మించని గుడిసెలో బుడ్డీదీపం గుడ్డివెలుగులో ఓ కుర్రవాడు ఓనమాలు దిద్దుకొన్నాడు.

బుద్ధిదీపం అందించే గోరంత వెలుగులో ఆ కుర్రవాని భవిష్యజ్జీవితపు కొండంత వెలుగుకోసం ఆయన యత్నించాడు.

ఇది ముప్పై యేళ్ళనాటి మాట!

మరి యిప్పుడు?

ఇప్పుడా? అలాంటి కుర్రవాళ్ళు ఒక్కరా? యిద్దరా? వేలాదిమంది. ఈ వేలాది గోరంత దీపాలకు కొండంత వెలుగు నివ్వాలని అహరహము కృషిచేస్తున్న ఉపాధ్యాయులు వందలమంది. అందరు ఆయనచేతి చలువతో బ్రదుకుతున్నారు.

ఎప్పుడయినా—

"ఏమండీ! 'ఆయనేముంది? అంటరానివాళ్ళ నడ్డం పెట్టుకుని బ్రదుకుతున్న మనిషి. పరహితార్థం పేరుతో స్వార్థం పెంచుకొంటున్న మనిషి. నోరులేని పిల్లవాళ్ళను అర్ధ కడుపులతో నోళ్ళు గొడుతున్న మనిషి'— అని రకరకాలుగా ఈ లోకం ఆడిపోసుకొనింది గదా? మరి అలాంటి మాటలు మీరెలా భరించగలిగారు?" అని అడిగితే—

"బాబూ! ఉప్పునయినా కారపు పొడినయినా ఓ మనిషిమీద చల్లి చూడు. అతని ఒంటిమీద పుండ్లుంటేనే మంటబెడుతుంది. లేకుంటే రాలిపోతుంది. అంతే బాబూ! మనిషిలో కూడా తప్పులుంటేనే అనినమాట తగులుతుంది. లేకుంటే గాలిలో కలిసిపోతుంది. ఈమాత్రం అవగాహన శక్తి లేకుండా ధ్యేయాన్ని వదలిపెడితే అది పిచ్చితనం బాబూ—కాకుంటే చేతగానితనం!" అని నవ్వేవారు.

జీవితాన్ని కాచి వడపోసిన ఎంతటి పరమసత్యం!

అందుకే అప్పుడప్పుడు ఆయన వద్దకు వెళ్ళేవాడిని. ఆ ఉయ్యాల పీటమీద ఆయన కెదురుగా కూర్చుంటే—యిద్దరి బరువుతో ఆ చెట్టుకొమ్మ వంగుతూ లేస్తూ గాలివాటంగా కదులుతూ ఉంటే—అదొక రకమయిన అనుభూతి. ఆయన జీవితానుభవాల్ని వింటూ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆశించడములో ఆనందం! ఆ ఉయ్యాల పీటమీద ఆయన ఎదురుగానే

కాదు—ఆయన గుండెల్లో కూడా కాస్త చోటు సంపాదించుకొన్నాను. అందుకే ఆయన ఆప్యాయంగా దగ్గర చేరుస్తారు.

ఆ రోజు కూడా వెళ్ళాను. అల్లంత దవ్వులో నేను కనుపించగానే ఆప్యాయంగా 'రా బాబూ! రా!' అని నవ్వుతూ ఆహ్వానించే మనిషి ఆ రోజు నా రాకను గమనించే స్థితిలో లేరు.

అతని ఎదురుగా నిలబడ్డాను!

ఆ ఆనందానుభూతి నుండి ఆయన తేరుకోలేదు. ఆ అనుభూతిని చెరిపివేయడానికి నేను సాహసించలేదు. అలానే మరో నాలుగయిదు నిము షాలు దొర్లిపోయాయి. నాకు తెలియకనే నాలో ఓర్పు నశించిందనడానికి నిదర్శనంగా ఓ పొడిదగ్గు గొంతులో గుంజులాడుకొనింది.

ఆయన నా వంక చూశాడు, అరమోడ్పు కన్నులతో చూస్తూ 'ఎప్పు డొచ్చావు బాబూ!' అని అడిగారు.

"ఆప్యాయత ఎలా వుంటుంది?" అని అడిగితే అది ఆయన పిలు పులో వుంటుందని చెప్పడానికి నిదర్శనంగా ఉందా పిలుపు.

"అదృష్టవంతుడికి కన్నీటితో అభిషేకం జరుగుతున్నపుడు!"

నా మాట చెవిన పడడంతో ఆయన పెదవులు అందమయిన వంపుల్ని సంతరించుకొన్నాయి. ఆ వంపుల సందుల్లో చిరునవ్వు చిత్రంగా యిరుక్కొనింది.

"అవును బాబూ! నిజంగా అతడు అదృష్టవంతుడే!

అనుభూతికి పరాకాష్ఠ తృప్తి. ఆ మాటంటుంటే అతని మొగం తృప్తితో వెలిగిపోతూ వుంది. కుతూహలంతో అతని వైపు చూస్తూ నిల బడ్డాను.

"కూర్చో బాబూ! కూర్చో—ఆ అదృష్టవంతుడి కథ చెప్పాలని ఎన్నోసార్లు అనుకొన్నానేకానీ ఎందుకో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చింది. అందుకేనేమో? — దేనికయినా కలిసిరావాలంటారు. ఈరోజు కలిసివచ్చింది. చెబుతా వినుబాబూ!"

గతాన్ని నెమరువేస్తూ భవిష్యత్ సందర్శనంతో అనుభూతిని పొందుతూ ఓ మహా మౌనిపుంగవుడిలా అదో భంగిమలో కూర్చున్న అతడు—ఆ తీరును తీసి మూటకట్టి అవతలబెట్టి మామూలుగా కూర్చు న్నాడు. కథ చెప్పడానికి తలపడిన తాతయ్యను తలపింపచేస్తున్నాడు.

పడమటికొండ కొనకొమ్మమీద నిలబెట్టిన బంతిలా వెలిగిపోతున్నాడు సూర్యుడు. మరి కాసేపటిలో కాలపురుషుడి కాలితన్నుతో కొండ కావల పడి లోకాన్ని నిండు చీకటితో నింపేవాడు—చావు తెలివి అన్నట్లుగా మబ్బు తునకలకు చుట్టూ జరీ అంచుచుట్టాడు. ముగ్ధమనోహరంగా ఉంది పడమటిదిశ. అప్పుడప్పుడే అక్కడి చెట్లమీద చేరుతున్న పక్షులు అరుస్తు న్నాయి. ప్రార్థనాలయంలోనేమో తంబుర శ్రుతి సవరింపు సన్నగా వినిపిస్తూ ఉంది. ఆయన చెబుతున్నాడు. నేను వింటున్నాను.

"బాబూ! యిరవైయేండ్ల కిందటిమాట. ఎక్కడినుండి వస్తున్నానో అక్కడికి ఎందుకు వెళ్ళానో యిప్పుడయితే మతికి రావటంలేదుకానీ యింటికి వస్తున్నాను రైల్లో. దాదాపు రెండురోజుల ప్రయాణం. ఎన్ని వసతులుండినా రైల్లో రెండురోజుల ప్రయాణమంటే పొద్దుపోవడం కాస్త కష్టమే! పక్క నున్న ప్రయాణీకులు కలుపుగోలుతనం కలవాళ్ళయితే ఫరవాలేదు కానీ మూతిబిగించి కూర్చునే రకాలైతే మరీ యిబ్బంది. ఇలాంటి యిబ్బందుల్లో నుండి బయటపడాలంటే అలాంటి సమయాల్లో పుస్తకాలే మన నేస్తాలు. ఏమంటావ్?"

ఇందులో అనడానికేముంది?—ఆయన చెబుతున్నది అక్షరసత్యం. అందుకే అనడమెందుకని వినడానికే సిద్ధపడి బాగా సర్దుకొని కూర్చున్నాను.

అయన మతికేమి వచ్చిందో యేమో తెలియదు. ఉన్నట్లుండి ఓ పిచ్చివాడిలా నవ్వడానికి ఆరంభించారాయన. నేను ఆశ్చర్యపడినా ననడం కంటే అదిరిపడ్డాననడం సమంజసం. ఆ స్థితి నుండి నేను తేరుకొనక మునుపే ఆయన మళ్ళీ గంభీరంగా మారిపోయారు. ఈ మార్పుకు తీర్పు కుదరక ఆయనవంక నేను నివ్వెరపడి చూస్తూ ఉండిపోయాను.

"నాకు తెలుసుబాబూ? నువ్వు ఆశ్చర్యపడుతున్నావని. కారణం ఏమీలేదు. మన తెలుగువాళ్ళు మనసులో మెదిలారు. అంతే!"

తెలుగువాళ్ళు మనసులో మెదలడానికి ఆయన నవ్వుకు ముడిపెట్టుకోలేక కనుబొమ ముడిచాను. ఆయన గ్రహించాడు.

"తెలుగువాళ్ళకు తెలుగంటే బోలెడంత అభిమానం బాబూ!" అంటూ మళ్ళీ కాసేపు విరగబడి నవ్వారాయన.

ఆయన నవ్వు ఆపుకొనేవరకు నోరు తెరవకుండా ఆయనవైపే చూస్తూ ఉండిపోయాను. ఆ తరువాత—

"ఎవరిభాషమీద వాళ్ళకు అభిమానం ఉంటుంది గదండీ! అందులో తప్పుకూడా లేదు. లేదంటే—ఆంధ్రులు ఆవేశపరులు కాబట్టి ఆ అభిమానం కాస్త మోతాదు మించి ఉంటుంది. అదే లేకుంటే భాషా ప్రయుక్తరాష్ట్రాలు లేవు. మనకు ఆంధ్రదేశం అసలే ఉండేదికాదు."—నా నోట్లోమాట నోట్లో ఉండగానే ఆయన అందుకొన్నాడు.

"అదేబాబూ అదే? నేననేదీ అదే!! — ఆ తెలుగుమీది అభిమానం ఉంది చూశావూ? పక్కనున్న వాడి చేతిలో తెలుగు పుస్తకం కానీ లేదా ఓ వారపత్రికకానీ కంటపడితే చాలు!—దాని దుంపదెగ!—ఆ అభిమానం మరీ ఎక్కువైపోతుంది."

తెలుగువాడిని నిర్దాక్షిణ్యంగా కొడుతున్న దెబ్బ .నాకూ తగిలింది. దెబ్బ తగులుతున్నా ముక్కుమూలగరాని దెబ్బ అది. అందుకే ఆయనతో కలిసి నేనూ కాసేపు హాయిగా నవ్వుకొన్నాను—ఏడ్చి మొగం కడుక్కొన్నట్లు!

"నేనుకూడ తెలుగువాడినే కదా బాబూ! ప్రక్కనున్న ప్రయాణీకుడి చేతిలో ఓ పత్రిక కంటపడేసరికి మొదట వంగి వంగి చూశాను—అది తెలుగు పత్రిక అవునో? కాదో? తెలుసుకొందామని! ఓ తెలుగు వారపత్రిక అని తెలిసేసరికి అతడు చదువుతున్న పేజీల్లోకి నిక్కినిక్కి చూశాను. నా అవస్థను గమనించిన ఆ పెద్దమనిషి అదోరకమయిన చూపును విసిరేసరికి—

పరధ్యానంగా ఎటో చూస్తున్నట్లు నటించాను. ఎంతసేపు? కాసేపు. అంతలోనే మళ్ళీ మొదటికే వచ్చింది పరిస్థితి. నాకు తెలియకనే నా చూపులు ఆ పత్రిక వైపు మళ్ళాయి. ఇదంతా గమనించిన ఆ పెద్దమనిషి—పాపం! మంచి మనిషిలా ఉన్నాడు. ఆ వారపత్రికను నా చేతికందించి అంతకంటే మంచిపని అప్పటికి లేనట్లు తన పడకమీద ముసుగుతన్ని పడుకొన్నాడు. నేను ఆ పత్రికను ఆప్యాయంగా అందుకొన్నాను—ఎంతయినా తెలుగువాణ్ణి కదా బాబూ!"—అని చెట్టుమీద చేరిన పిట్టలు ఎగిరిపోయేటంత గట్టిగా నవ్వి నారాయన ఆ మాటంటూ.

అంతలో ఓ నడివయస్సు మనిషి అక్కడ ప్రత్యక్షం కావడంతో కథా గమనం కుంటుపడింది. ఓ లావుపాటి పుస్తకాన్ని రెండు చేతులతో పొదివి పట్టుకొని నిలబడి ఉన్నాడతడు. బహుశా అదేదయినా ఓ చిట్టా పుస్తకం కావచ్చు. ఆ వ్యక్తిని చూస్తూనే—'రావయ్యా! రా?' అంటూ పిలిచారాయన. అతడు అందించిన ఆ లావుపాటి పుస్తకాన్ని చేతి కందుకొన్నారు. అతడు చూపిన చోటంతా సంతకాలు పెడుతూ "పెట్ట మన్న చోటంతా కండ్లు మూసుకొని సంతకాలు పెడుతున్నాను. అనాథలయిన పిల్లలు. వాళ్ళ అధోగతికి దారితీస్తే పుట్టుగతులుండవు ఇదిమాత్రం మనసులో పెట్టుకోండి!" అని అంటూ పుస్తకాన్ని అతని చేతి కందించారు. ఆ చెవులకు ఈ మాటలకు బాగా పొంతనాలు కుదిరినట్లుంది. అతడు నోరు కదపలేదు కానీ వంగి నమస్కరించి వెళ్ళిపోయాడు.

"నా తెలుగుతనాన్ని గురించి చెబుతూ ఆగిపోయానుకద బాబూ! దేశంకాని దేశంలో వేళకానివేళ ఓ తెలుగు వారపత్రిక చేతికందడంతో గడచిన ప్రయాణంకంటే గడవవలసిన ప్రయాణం కాస్త హాయిగా ఉంటుందన్న నమ్మకం కుదిరింది. పేజీలు తిప్పుతూ ఓచోట ఆగిపోయాను!"

ఆ మాటంటూ ఆయన ఆగిపోయారు!

అటు చూసేసరికి నాలుగయిదు బారల దూరంలో నలుగురయిదుగురు పిల్లలు. గోళ్ళు గిల్లుకొంటూ నిలబడ్డారు. ఆయనవైపు దీనంగా చూస్తు

న్నారు. ఆయన దృష్టి వాళ్ళమీద పడేసరికి అప్రయత్నంగా వాళ్ళ తలలు వాలిపోతున్నాయి. ఆ పిల్లవాళ్ళ భావన అర్థమయిందన్నట్లుగా ఆయన లేచి వాళ్ళదగ్గరికి వెళ్ళారు. వాళ్ళేదో చెప్పారు. ఆయనకూడా వాళ్ళకేదో చెబుతూ ఒకడి భుజంతట్టి మరొకడి బుగ్గలు గిల్లి యింకొకడి తలనిమిరాడు. అంతే! పరుగో పరుగు. ఆ పిల్లలు ఆనందానికే కాళ్ళు వచ్చినట్లుగా పరుగు లెత్తారు. అలా వెడుతున్న ఆ పిల్లల్ని అలానే చూస్తూ నిలబడ్డారు కాసేపు. ఆ తరువాత తనలో తాను నవ్వుకొంటూ వచ్చి ఉయ్యాలపీట మీద కూర్చున్నారు.

"బాబూ! ఒకప్పటితో పోల్చిచూస్తే తెలుగులో చాలా పత్రికలు వస్తున్నాయి. ఇప్పుడు చాలా చాలా కథల్ని కూడా ప్రచురిస్తున్నాయి. ప్రచురించిన ప్రతి కథకు ఓ బొమ్మను కూడా వేయిస్తున్నారు. అయితే బొమ్మను చూచి కథను చదవాలన్న తలంపు కలిగే తీరులో బొమ్మలు చాలా అరుదుగా కనిపిస్తుంటాయి. ఏమంటావ్?"

తీరని పనుల్లో తల మునకలవుతున్న ఆ మనిషికి యింతటి స్తన శల్య పరీక్షచేసే తీరిక ఎలా దొరికింది? — అని ఆశ్చర్యపడుతూ 'నిజమే నండీ!' అన్నాను.

"ఇంతకు మునుపే అన్నాను గద బాబూ! ఆ వార పత్రిక పేజీలు తిప్పుతూ ఓ చోట ఆగిపోయానని! ఆ పత్రికలో అలాంటి బొమ్మ కంట పడింది. అందుకే ఆగిపోయాను." ఆ బొమ్మ కలిగించిన అనుభూతి మరలా మనసులో మెదిలిందేమో? ఆయన కాసేపు అరమోడ్పు కన్నులతో అలానే ఉండిపోయారు.

"అది ఓ రైలు పెట్టె. ఆ పెట్టెలో ఓ కుర్రవాడు అడుక్కొంటు న్నాడు. వాడు చేయి చాపి నిలబడిన తీరు....వాడి చూపుల్లో కొట్టవచ్చి నట్లున్న జోరు....నన్ను ఆకట్టుకొన్నాయి. అందుకే ఆ కథ చదివాను."

ఆయన చూపుల్ని ఆకట్టుకొన్న ఆ బొమ్మ....ఆ బొమ్మ వెనుకకథను విందామన్న కుతూహలాన్ని ఆయన పసిగట్టాడు.

"నువ్వు చూస్తూనే ఉంటావుబాబూ రైళ్ళల్లో ప్రయాణం చేసేటప్పుడు పట్టుపని పదేండ్లు నిండని కుర్రవాళ్ళు.... ఆ పెట్టెను ఈ కడనుండి ఆ కడ దాకా తుడుస్తారు. ఆ తరువాత ఆ పెట్టెలోని ఒక్కొక్కరి ముందు నిలబడి చేయిచాస్తారు. తోచిన వాడు తోచినంత యిస్తే దాంతో పూట గడుపు కొంటారు. ఈ పిల్లవాడు కూడా అలాంటి కోవకు చెందిన వాడే బాబూ!" ఆ మాటంటుంటే ఆయన గొంతు తడబడింది—బహుశా ఈ దేశంలో యిలాంటి నికృష్టపు బ్రదుకులకు ఎందరు బలి అవుతున్నారో అని.

"ఆ పదేండ్ల బుడతడు ఆ పెట్టెను ఈ చివరి నుండి ఆ చివరిదాకా తుడుస్తాడు. అటుపై ఒక్కొక్కరి ముందు చేయి చాస్తూ....యిచ్చినవాడికి ఓ నమస్కారం పడేస్తూ...లేదన్న వాళ్ళవైపు దీనంగా చూస్తూ....ఓ వ్యక్తి ముందు నిలబడతాడు. నిలబడి మామూలుగా చేయిచాస్తాడు. ఆ వ్యక్తి వాణ్ణి దగ్గరికి పిలుస్తాడు. ఆ పిలుపులోని ఆప్యాయత ఎంతో ఆశను రేకెత్తిస్తుంది. కుర్రవాడు ఆ వ్యక్తి దగ్గరికి వెళతాడు. 'నీ పేరేమిటి బాబూ?' అని ఆరంభిస్తాడు, ఆ వ్యక్తి పైసలిచ్చే ప్రయత్నం చేయకుండా! ఆ కుర్రవాడు ఏమనుకొన్నాడో యేమో? ఓ నిర్లక్ష్యమైన చూపు విసిరేసి 'నా పేరు దొరైరాజ్!" అని అంటూ చేతిలోని పైసల్ని అలా ఎగరేసుకొంటూ దర్జాగా వెళ్ళిపోతాడు. అలా వెళ్ళిపోతున్న కుర్రవాడి ధోరణికి మొదట ఆశ్చర్యపడి ఆ తరువాత ఆలోచనలో పడతాడా వ్యక్తి! ఇదీ కథ!!" అని తాను చదివిన కథను చెబుతూ—

"బాబూ! నేను కూడా ఆలోచనలో పడ్డాను. నిజమేగదా? ఎందరో వాడి ఈడు పిల్లలు—జేబులు కొడుతున్నారు. ప్రయాణాల్లో ఏమరుపాటుగా ఉంటే చేతికందిన సామాన్లు పట్టుకొని ఉడాయిస్తున్నారు. మరి కొంత మంది కలవాళ్ళ చేతుల్లో తోలుబొమ్మలవుతున్నారు. ఇంకొంతమంది యిండ్ల ముందు నిలబడి కడుపుమంటల్ని కంటిచూపుల్లో నిలుపుతున్నారు. అలాంటప్పుడు అంతో యింతో పనిచేసి పొట్ట గడుపుకోవాలనుకోవడం గొప్ప సంగతేకద బాబూ?—నిజంగా వాడు దొరైరాజే."

"బాబూ! నా ఆలోచనల్లో నేనుంటే సరిగ్గా యిలాంటి సంఘటనే నా కంట పడింది బాబూ ఆ రైలుపెట్టెలో!"

ఈ కథ మీది కథను వినాలన్న కుతూహలం హెచ్చింది నాలో!

"బాబూ! గిజిగాడి గూడు ఉంటుంది చూశావు గదూ? దానిని పీచు పీచుగా పీకి తలమీద అతికించినట్లుంది—బూడిదరంగు తిరిగిన వెంట్రుకల్ని చూస్తుంటే! నల్లని నూనెలో తడిసీ తడవక ముందే పిండి తొడుక్కొన్నట్లున్నాయి—అందీ అందని నిక్కరు చొక్కా! అసలు ఒంటిరంగు మంచి దయినా దుమ్ము మరకలు కట్టి నలుపు తెలుపు కలిసిన బూడిదరంగు తేలింది ఒళ్ళంతా పొడలు పొడలుగా! అయినా కళ్ళల్లో ఆశ చావలేదు. చేస్తున్న పనిలో శ్రద్ధ తగ్గలేదు. పట్టుమని పదేళ్ళయినా నిండని కుర్రవాడు ఆ రైలు పెట్టెను ఊడుస్తూ వస్తున్నాడు. కాసేపు నిదానించి వాడివైపు చూశాను ఆ తరువాత చూపు మరల్చుకొన్నాను. అయినా వాడు కళ్ళల్లోనే మెదులు తున్నాడు. చదివిన కథ మనస్సును తొలుస్తూ ఉంది. నాలో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. ఆలోచనను ఆచరణలో పెట్టాలన్న తలంపుతో అలానే పడుకొన్నాను, పడక మీద. కళ్ళు మూసుకొన్నట్లున్నానే కానీ చూడగలుగుతున్నాను. విప్పిన పత్రిక గుండెల మీద పడి చప్పుడు వింటూ ఉంది!"

అంతలో 'టప్' మన్న శబ్దం వినిపించింది. మా యిద్దరి దృష్టి అటు మళ్ళింది. ఓ పిట్ట రెట్ట విడిచింది. అది ఆ ఉయ్యాల పీటమీద యిద్దరి మధ్యగా పడింది. ప్రక్కన పడి వున్న ఓ పాత కాగితాన్ని అందుకొని నేనా రెట్టను తుడిచి వేస్తుంటే—అదోరకంగా నవ్వారాయన!

"బాబూ! పిట్టరెట్ట వేసింది గదూ? ఎందుకు వెయ్యాలి? అంటే— ఏమని చెప్పగలం? అది దాని స్వభావం. అంతే! మనుష్యుల స్వభావాలుకూడ అలానే ఉంటాయి. ప్రయత్నించి ఫలితాన్ని సాధించడములో కొందరికి ఆనందం. అసలు ప్రయత్నాల ప్రమేయమే లేకుండా జీవితాల్ని కొనసాగించా లన్నది కొందరి అభిమతం. నా జీవితమంతా యిలాంటి ప్రయత్నాలతోనే

కథా నిలయం
1226

కొనసాగుతూ ఉంది. అందుకే ఆ కుర్రవాడి బ్రతుకు మీద కూడా ఓ ప్రయత్నం చేయాలని సంకల్పించాను."—అంటూ కాసేపు ఆగారు.

ఆ తరువాత—

"ఆ! రైలుపెట్టెలో కుర్రవాడిని గురించి చెబుతూ వచ్చాను కదూ! అవును. మరో నాలుగయిదు నిముషాల్లో నేను పడుకొని వున్న చోటువరకు ఊడ్చుకొంటూ వచ్చాడు. అక్కడ కాసేపు ఆగాడు. ఆగి నిద్రపోతున్నట్లున్న నా వైపు—ఆ కాగితం వైపు మార్చి మార్చి చూశాడు. ఆ తరువాత నన్ను లేపడానికి మెల్లగా తట్టాడు.

నేనేమో అప్పటికి మహానిద్రపోతున్నట్లుగా ఆవిలిస్తూ లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకొన్నట్లుగా నటించి—ఆ తరువాత కండ్లు తెరచి చూశాను ఆ కుర్రవాని వైపు. ఒదిగి నిలబడి వినయంగా వాడు నాచేతి కందించా డా కాగితాన్ని — ఆ కాగితం — లోకం దృష్టిలో దాని విలువ అయిదు రూపాయలు!!—

ఆ కుర్ర వాణ్ణి పరీక్షించడానికి నా ప్రయత్నంగా నేను జార విడిచిన కాగితమది!

మారు మాట్లాడకుండా వాడి చేతిలో ఓ పావలా కాసు పెట్టాను. మాటల్లోకి దింపితే కథలో కుర్రవాడి మాదిరి మాట్లాడకుండా వెళ్ళిపోతాడేమో? అని సందేహం. ఆ కుర్రవాడు పావలా డబ్బులందుకొని రెండు చేతులు జోడించి నమస్కరించాడు. ఆ తరువాత తన పనిలో తాను లీనమయ్యాడు.

"బాబూ!"—ఆప్యాయంగా పిలిచాను.

మాట చెవిని పడడంతో ఆ కుర్రవాడు లేచి నా ఎదురుగా నిలబడ్డాడు.

"నువ్విప్పుడు చిన్న పిల్లవాడివి. ఈ పని చేసి బతగ్గలుగుతావు. బాగానే ఉంది. అయితే యింకొన్నాళ్ళకు పెద్దవాడివవుతావు. అప్పుడీ పని చేయలేవు. చేసినా అందరూ నిన్ను తప్పుపడతారు. అప్పుడెలా బతుకుతావు బాబూ?"

నా మాటలు వాడికి అయోమయంగా వినిపించినట్లుంది. అమాయకంగా చూస్తూ నిలబడ్డాడు.

"అందుకే బాబూ! ఈ వయసులో చదువుకొంటే—ఆ వయసులో సంపాదించుకోవచ్చు."

తటాలున రైలు పట్టాలు తప్పివుండినా అంత ఆశ్చర్యపడేవాడు కాదేమో ఆ కుర్రవాడు. అంతకు మించిన ఆశ్చర్యాన్ని పులుముకొన్నాడు మొగంలో—'నన్నెవ్వరీలోకంలో చదివించే వాళ్ళున్నట్టుగా.'

"నాతో వచ్చేస్తావా బాబూ."

తల వంచాడు!

"ఆ కుర్రవాడే ఈ కుర్రవాడు బాబూ!"

అర్ధగంటకు మునుపు ఆయన పాదాలకు నమస్కరించిన కుర్రవాడు కనుల ముందు కదిలి ఇద్దరి మధ్య సంబంధం మనస్సులో మెదిలి—అటూ యిటూ కదలలేకుండా కూర్చున్నాను.

"ఏముంది బాబూ? పదిమందిలో వాడూ ఒక్కడైనాడు. అయితే పట్టుబట్టి చదువుకొన్నాడు. కృషికి తగిన ఫలితం. మంచి ఉద్యోగమే వచ్చింది. ఆ తరువాత ఓ ఇంటివాణ్ణి చేశాను. ఉద్యోగార్థం ఊరువదలి పోతూ "బాబయ్యా! నే నెప్పుడు పుట్టానో నాకు తెలియదు. ఎవరికి పుట్టానో కూడా ఎరగను. ఎందుకు పుట్టానో ఆలోచించవలసిన అవసరం లేకపోయింది. అయితే—నేను పుట్టిన రోజు మాత్రం ఈ విద్యానగరంలో అడుగు పెట్టిన రోజు. ఆ రోజు నేనీ జీవితంలో మరువలేను. అందుకే ఆ రోజున మీ రెక్కడున్నా నే నెక్కడున్నా తమ పాదాలను ప్రణమిల్లే అవకాశాన్ని మహాదృష్టంగా భావిస్తాను. ఈ జీవిత కాలమంతా అలాంటి అదృష్టం లభించే లాగున ఆశీర్వదించండి?" అంటూ పాదాలమీద పడ్డాడు.

ఆయన గొంతు గాద్గదికమైపోయింది. మాటలు పూడుకపోతున్నాయి. గుండెల్లోని ఆనందం కండ్లల్లో రాలుతూంది ముత్యాల్లా!

"సరిగ్గా ఈ రోజేబాబూ!—బాబు విద్యానగరంలో అడుగుపెట్టిన రోజు. అంటే—బాబు పుట్టిన రోజు!"

ఆ కనుకొలకుల్లో కన్నీళ్ళు నిలిచాయి. ఎందుకని అడిగితే ఏమని చెప్పను?

"బాబూ! ఇది వేపచెట్టు. సహజంగా 'వేపచెట్టు' అని చెవినిపడడంతో 'చేదు' అన్న భావన మనసులో మెదులుతుంది. అయితే ఆ వేప చెట్టే కూర్చుంటే—నీడనిస్తుంది. దినమూ ఒక ఆకునమిలి మింగగలిగితే దీర్ఘవ్యాధుల్నే నయం చేస్తుంది. పంటిపుల్లగా నోటిజబ్బుల్ని పోగొడుతుంది! అలాగే బాబూ! అడుక్కు తినేవాళ్ళు అని హీనంగా చూస్తే అడుగంటిపోతారు. దగ్గర చేరిస్తే నిగ్గుతేలుతారు. ఏ నాటికో ఒకనాటికి కొండంత వెలుగునిస్తారు!"

చేదు నిజాన్ని తియ్యగా పలికిన ఆ మహామనీషికి నమస్కరించాను మనస్సులోనే.

—ఆంధ్ర భూమి (24-4-80)